

ఆదివాసీ గూడెం నుంచి అసెంబ్లీకి..
ఉట్నూర్ మండలం ఘన్‌పూర్ పంచాయతీ పరిధి కల్లూర్‌గూడ గిరిజన గ్రామం. ఇక్కడి పేద కుటుంబానికి చెందిన వెడ్మ బొజ్జు ఇటీవల ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 8లో▸

‘పులి’ బాధితులకు పరిహారం

తాంసి: పులిదాడిలో పశువులు మృతి చెందగా వాటి యజమానులకు అటవీశాఖ సెక్షన్ అధికారి హైమద్‌ఖాన్ గురువారం ఆయా గ్రామాల్లో పరిహారం చెక్కులు పంపిణీ చేశారు. మండలంలోని తాంసి(కే) గ్రామానికి చెందిన సురేశ్‌కు రూ.30వేలు, ఎల్లన్నకు రూ.8వేలు, జైనథ్ మండలం కోర్ట గ్రామానికి చెందిన తులసీబాయికి రూ.7,500 చెక్కులు అందించారు. పులి సంచారం ఉన్నందునా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీట్ అధికారి సాయికుమార్, సిబ్బంది కృష్ణ, సోనేరావు, దత్తు తదితరులున్నారు.

గరిష్టం/కనిష్టం
28.0/17.0

వాతావరణం
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణం చల్ల బడుతుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

నేడు ‘డయల్ యువర్ డీఎం’

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో ఈ నెల 8న ఉదయం 11నుంచి 12గంటల వరకు ‘డయల్ యువర్ డీఎం’ నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. సలహాలు, సూచనలు, ఫిర్యాదులు అందించాల్సిన ప్రయాణికులు 99592 26002 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

4నుంచి 10వ తేదీ వరకు డీఎడ్ ఫస్టియర్ పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: 2022–24 బ్యాచ్‌కు చెందిన డీఎడ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు జనవరి 4నుంచి 10వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ రవీందర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు గమనించి సకాలంలో హాజరు కావాలని సూచించారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో అనుష్కకు గోల్డ్‌మెడల్



అభినందనలు అందుకుంటున్న అనుష్క

ఆదిలాబాద్: ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో జిల్లా క్రీడాకారిణి గాయక్వాడ్ అనుష్క సత్తా చాటింది. నల్గొండ జిల్లాలో ఈనెల 5వ తేదీ నుంచి గురువారం వరకు జరిగిన 67వ ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్–17 కరాటే పోటీల్లో 58 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిందని ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు పేర్కొన్నారు. విజేతగా నిలిచి జాతీయస్థాయికి ఎంపికైందని తెలిపారు. ఈనెల 16నుంచి 19వ తేదీ వరకు ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుందని పేర్కొన్నారు. అనుష్కకు పలువురు అభినందనలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కైలాస్‌నగర్: అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 2023వ సంవత్సరానికి గాను వికలాంగులకు సేవలందించిన వ్యక్తులు, సంస్థలకు నిర్వహించే రాష్ట్ర స్థాయి సన్మానాల కోసం అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి మిల్కా ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తమ ఉద్యోగులు, ఉత్తమ స్వయం ఉపాధి కలిగిన వారు, ఉత్తమ వ్యక్తిగత సామాజిక సేవలందించిన వారు, ఉత్తమ క్రీడాకారులు, ఉత్తమ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, సాంస్కృతిక నైపుణ్యం కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు https:// forms. gle. xhYL9 pxhKADzHvtp9 లింక్ ద్వారా ఈ నెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు wdsc. telangana. gov. in లో చూడాలని సూచించారు.

స్వయం ఉపాధిలో రాణించాలి



శిక్షణ పొందినవారితో ఐటీడీఏ పీవో

ఉట్నూర్ రూరల్: ఉట్నూర్ మండలకేంద్రంలోని ఫకీర్‌గుట్ట కాలనీలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ నాక్ ఆధ్వర్యంలో మూడో బ్యాచ్ 30 మందితో మూడు నెలల ఉచిత కుట్టు శిక్షణ గురువారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఐటీడీఏ పీవో చాహత్‌బాజ్ పాయి హాజరయ్యారు. శిక్షణ పొందిన 25మందికి నాక్ నుంచి ఉచితంగా అందించే కుట్టు మిషన్లను అందజేశారు. అనంతరం పీవో మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అనంతరం శిక్షణ పొందినవారిని అభినందించారు. ఈ సందర్భంగా పీవోను శాలువాతో సన్మానించారు. నాగ్ ఏడీ నాగేంద్రం, లేబర్ ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ గంగన్న, ఉట్నూర్ సామాజిక కార్యకర్త అంజద్‌ఖాన్, నాక్ ఇన్‌స్పెక్టర్ నిక్కత్ తదితరులున్నారు.

ఓట్లు పెరిగినా ఓటమే!

- రెండుచోట్లా కాంగ్రెస్‌కు పరాభవం
- నైరాశ్యంలో ‘హస్తం’ పార్టీ నేతలు
- రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌కు ఆదరణ
- జిల్లాలోని ఓటర్లది భిన్నమైన తీర్పు



గత ఎన్నికల్లో పార్టీల వారీగా పోలైన ఓట్లు..

ఆదిలాబాద్ నియోజకవర్గంలో...

పార్టీ	2014	2018	2023
టీఆర్‌ఎస్	58,705	74,050	60,916
బీజేపీ	43,994	47,444	67,608
కాంగ్రెస్	30,298	32,000	47,724

బోథ్ నియోజకవర్గంలో...

టీఆర్‌ఎస్	62,870	61,125	76,792
కాంగ్రెస్	35,877	54,639	32,797
టీడీపీ	35,218	–	–
బీజేపీ	–	4,840	53,992

కైలాస్‌నగర్: రాష్ట్రవ్యాప్తంగా హస్తం గాలి వీచి కాంగ్రెస్ అధికారం చేపట్టగా జిల్లాలో మాత్రం ఆ పార్టీకి భంగపాటు తప్పలేదు. ఇతర జిల్లాల ప్రజలు కాంగ్రెస్‌కు అండగా నిలువగా జిల్లా ఓటర్లు ఇందుకు భిన్నమైన తీర్పు ఇచ్చారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన నుంచి జిల్లాలో కాంగ్రెస్‌కు మొండి చేయే ఎదురవుతోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆ పార్టీకి మరోసారి నిరాశే మిగిల్చాయి. ఓట్ల శాతం పెరిగినా ఎమ్మెల్యే సీట్లు మాత్రం దక్కలేదు. ఈ ఎన్నికల్లో హోరాహోరీగా సాగిన పోరులో గెలిచి అసెంబ్లీకి వెళ్తామని భావించిన కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటర్లు చేదు అనుభవాన్నే మిగిల్చారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లోనూ ఆ పార్టీ అభ్యర్థులు ఓటమి పాలవ్వడంతో కాంగ్రెస్ శ్రేణులు నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అయితే జిల్లాలో కాంగ్రెస్ ఓడిపోయినా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందనే సంతోషంతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మూడుసార్లు పరాభవమే..
తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన నుంచి ఆదిలాబాద్ నియోజకవర్గానికి మూడుసార్లు ఎన్నికలు జరిగాయి. మూడుసార్లూ కాంగ్రెస్ ఓటమి పాలైంది. ప్రతీ ఎన్నికల్లో ఓట్ల శాతాన్ని పెంచుకుంటున్నప్పటికీ పదవి మాత్రం పార్టీకి అందని ద్రాక్షలా మారింది. 2014లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన భార్గవ్‌దేశ్ పాండే 30,298 ఓట్లు సాధించి మూడో స్థానంలో నిలిచారు. ఆ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థి జోగు రామన్న విజయం సాధించారు. 2018 ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని మార్చినా విజయం దక్కలేదు. ఆ ఎన్నికల్లో పోటీ చేసిన గండ్రత్ సుజాత 32,200 ఓట్లు సాధించినా మూడోస్థానానికే పరిమితమయ్యారు. గుడ్డిలో మెల్లలా 2014 కంటే 2018లో ఓట్ల శాతం కాస్త మెరుగుపడింది. తాజాగా జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా రంగంలోకి దిగిన కంది శ్రీనివాసరెడ్డి హోరాహోరీగా తలపడ్డారు. తన ప్రచారంతో ప్రత్యర్థులను ఓడించేంత పనిచేశారు. 47,724 ఓట్లు సాధించినా ఆయన కూడా మూడో స్థానంలోనే నిలిచారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్ అనూహ్యంగా విజయం సాధించారు. ఇలా గడిచిన మూడు ఎన్నికల్లోనూ ఓట్ల శాతం పెంచుకుంటున్నప్పటికీ పదవులు దక్కకపోవడం కాంగ్రెస్ శ్రేణులను తీవ్ర నైరాశ్యానికి గురిచేస్తోంది.

బోథ్ నియోజకవర్గంలో..
బోథ్ నియోజకవర్గంలోనూ కాంగ్రెస్‌కు ఆశించిన ఫలితం దక్కడం లేదు. అభ్యర్థులను మార్చుతున్నా గెలుపు దరిచేరడం లేదు. 2014లో ఆ పార్టీ నుంచి అనిల్‌జాదవ్ పోటీ చేయగా 35,877 ఓట్లు సాధించారు. ఈ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థి రాథోడ్ బాపూరావు విజయం సాధించగా అనిల్‌జాదవ్ రెండో స్థానంలో నిలిచారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సోయం బాపూరావు 54,639 ఓట్లు సాధించారు. గత ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 20వేల ఓట్లు పెరిగినా టీఆర్‌ఎస్ అభ్యర్థి రాథోడ్ బాపూరావు గెలిచారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆడే గజేందర్ బరిలో నిలిచి 32,797 ఓట్లతో తృతీయ స్థానంలో నిలిచారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్ విజయం సాధించారు. ఈ నియోజకవర్గంలో 1983 నుంచి కాంగ్రెస్‌కు విజయం అందని ద్రాక్షగానే మారింది. గెలుపు కోసం ఎంతగా ప్రయత్నించినా ఫలితం లేక పార్టీ శ్రేణులు ఆవేదనకు గురవుతున్నాయి.

జిల్లా ప్రజల విభిన్న తీర్పు
రాష్ట్రమంతా కాంగ్రెస్ గాలి వీచి అధికారం చేపట్టగా ఆదిలాబాద్ జిల్లా ఓటర్లు మాత్రం విభిన్నమైన తీర్పునిచ్చారు. అధికార పార్టీని కాదని ఇతర పార్టీల అభ్యర్థులకు జై కొట్టారు. ఆదిలాబాద్ నియోజకవర్గ ఓటర్లు బీజేపీని ఆదరించి పాయల్ శంకర్‌ను అసెంబ్లీకి పంపించగా బోథ్ నియోజకవర్గ ఓటర్లు మరోసారి బీఆర్‌ఎస్‌కే అండగా నిలిచారు. ఆ పార్టీ తరఫున పోటీ చేసిన అనిల్‌జాదవ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించారు. ఈ రెండు నియోజకవర్గాల్లోనూ సానుభూతే పనిచేసినట్లు రాజకీయ నేతలు చెబుతున్నారు. పదవులు దక్కకపోయినా కాంగ్రెస్ అధికారం చేపట్టడం పార్టీ శ్రేణులకు కొంత ఊరటనిచ్చింది. అయితే జిల్లాలో విభిన్న తీర్పునిచ్చిన ఓటర్లు మరికొద్ది నెలల్లో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతిస్తారనే దానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఇప్పటి నుంచే ఆదిశగా అన్ని రాజకీయ పార్టీలు దృష్టి సారించడం గమనార్హం.

తొలి విడతలో దక్కని చోటు

- మంత్రివర్గంలో ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం కరువు
- రెండో దఫా విస్తరణపైనే ఆశలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్ సర్కారులో తొలి మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఎవరికీ చోటు దక్కలేదు. రాష్ట్రంలో హైదరాబాద్, ఉమ్మడి జిల్లా నుంచి మినహా అన్ని చోట్ల ప్రాతినిధ్యం కల్పించారు. మొదటి కేబినెట్ విస్తరణలోనే ఒకరికైనా చోటు ఖాయమని అంతా భావించారు. గురువారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకార సమయంలోనే మరో 11మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సాయంత్రం తొలి కేబినెట్ సమావేశం కూడా నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, ఖానాపూర్ నియోజకవర్గాల నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వినోద్, గడ్డం వివేక్, వెడ్మ బొజ్జు ఉన్నారు. వీరిలో ఒకరికి కచ్చితంగా, వీలుంటే ఇద్దరికీ మంత్రివర్గంలో చోటు ఖాయమనే హామీలు వచ్చాయి. ఎమ్మెల్యేలు సైతం ఇదే విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. కానీ.. ఉమ్మడి జిల్లా నుంచి ఎవరికీ మొదటి మంత్రివర్గ విస్తరణలో అవకాశం రాలేదు. రాష్ట్ర మంత్రివర్గంలో సీఎంతో సహా మొత్తం 18మంది మంత్రి వర్గంలో ఉండొచ్చు. ప్రస్తుతం సీఎంతో కలిపి మొత్తం 12మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇక మిగిలిన ఆరుగురు మంత్రుల్లోనే ఉమ్మడి జిల్లా నుంచి ఒకరు లేదా ఇద్దరికి అవకాశం దక్కవచ్చు. ఈ క్రమంలో రెండో విడత కేబినెట్ విస్తరణలో ఎవరికి చోటు దక్కుతుందోనని చర్చ నడుస్తోంది. ఇక స్పీకర్‌గా వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌ను ఎంపిక చేసిన క్రమంలో డిప్యూటీ స్పీకర్‌గా మరొకరికి అవకాశం ఇవ్వొచ్చు. వీటితోపాటు మంత్రి తర్వాత కేబినెట్ హోదా కలిగిన చీఫ్ విప్, విప్ పదవులు ఉంటాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సామాజిక తూకంలో భాగంగా ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాల నుంచి ఎంపిక చేశారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా నుంచి మంత్రి రేసులో ఉన్న ప్రేమ్‌సాగర్‌రావుతోపాటు గడ్డం సోదరులు, వెడ్మ బొజ్జుకు కూడా తగిన ప్రాధాన్యత ఉంటుందని పార్టీ అధిష్టానం నుంచే ఇప్పటికే హామీలు వచ్చాయి. రెండో దఫా మంత్రివర్గ విస్తరణ పూర్తయితేనే ఉమ్మడి జిల్లా నుంచి ఎవరికి చోటు ఉంటుందనేది తేలనుంది.

సారు వెళ్లారు.. స్కానింగ్ ఆగింది

- ఉదయం నుంచి వేచిచూసిన గర్భిణులు
- ఇద్దరినే పరీక్షించి వెళ్లిన రేడియాలజిస్ట్
- నిరీక్షించి ఇంటిముఖం పట్టిన గర్భిణులు



పీహెచ్‌సీలో నిరీక్షిస్తున్న గర్భిణులు

గుడిహత్నూర్: గర్భిణులకు స్కానింగ్ సేవలు సరిగా అందడంలేదు. ఇందుకు మండల కేంద్రంలోని పీహెచ్‌సీ గురువారం నిదర్శనంగా నిలిచింది. క్షేత్ర స్థాయిలో గర్భిణులు, బాలింతల కోసం పని చేస్తున్న ఆశ కార్యకర్తలు నెలవారీ స్కానింగ్ (ఏఎన్‌సీ)లో భాగంగా మండలంలోని 18 మంది గర్భిణులను స్థానిక పీహెచ్‌సీకి ఉదయమే తీసుకువచ్చారు. నీళ్లు తాగి, ఎలాంటి ఆహారం తీసుకోకుండా స్కానింగ్ కోసం గంటల తరబడి వేచి చూసిన గర్భిణులు నానా అవస్థలకు గురయ్యారు. చివరికి స్కానింగ్ చేయడానికి వచ్చిన మొబైల్ రేడియాలజిస్ట్ విక్రమ్ ఇరువురిని మాత్రమే పరీక్షించారు. ఆ తర్వాత ఆశ కార్యకర్తలు సరిగా సహకరించడం లేదని, తాను స్కానింగ్ చేయడం కుదరదంటూ కోపంతో వెళ్లిపోయినట్లు గర్భిణులు తెలిపారు. దీంతో చేసేదేమీ లేక గర్భిణులు ఇంటిముఖం పట్టారు. ఆదివాసీ ప్రాంతాల్లో గర్భిణులకు ప్రసూతి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటైన ‘రౌండ్ ది క్లాక్’ ఆస్పత్రుల్లో ఇలా జరగడం సరికాదని వారు అసహనం వ్యక్తంజేస్తున్నారు. ఈ విషయమై జిల్లా వైద్యాధికారిని ఫోన్‌లో సంప్రదించగా.. మారుమూల ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులతో ఇలా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విషయమై తమతో శిక్షణలో ఉన్న మండల వైద్యాధికారి శ్యాంసుందర్ సహా రేడియాలజిస్ట్‌ను వివరణకు ఆదేశిస్తామని పేర్కొన్నారు.

‘రేవంత్ మాట నిలుపుకొన్నారు’



స్తూపం వద్ద మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

ఇంద్రవెల్లి: కొత్తగా సీఎంగా బాధ్యతలు స్వీకరించిన రేవంత్‌రెడ్డి ఆదివాసీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు రాయి సెంటర్ సార్‌మెడిలు మెస్రం వెంకట్‌రావ్, మెస్రం చిన్ను పటేల్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రేవంత్ రెడ్డి గతంలో ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద నిర్వహించిన దళిత, గిరిజన గర్జన సభలో స్తూపాన్ని స్మృతి వనంగా తీర్చుదిద్దుతానని ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. స్తూపం అభివృద్ధికి జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో తొమ్మిది తెగల ఆదివాసీలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. అలాగే 1981 ఘటనలో జరిగిన పోలీస్ కాల్పుల్లో మరణించిన కుటుంబాలు, గాయపడ్డ వారి కుటుంబీకులను గుర్తించి ఆదుకోవాలని, దీనిపై జిల్లా అధికారులు తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ పెద్దలు వెట్టి రాజేశ్వర్, మెస్రం నాగ్‌నాథ్, పెందోర్ గణేశ్, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి స్తూపంపై ఫోకస్

- అభివృద్ధిపై అధికారులకు సీఎం ఆదేశం
- ఉదయమే స్తూపం వద్దకు చేరిన కలెక్టర్
- స్మృతివనం ఏర్పాటుకు తీర్మానం



ఇంద్రవెల్లి స్తూపం వద్ద నిర్వహించిన సభలో నినదిస్తున్న రేవంత్‌రెడ్డి (ఫైల్)

సాక్షి, ఆదిలాబాద్: గురువారం ఉదయం 11 గంటల సమయం.. కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులతో ఇంద్రవెల్లి స్తూపం వద్దకు చేరుకున్నారు. మొదట అమరవీరులకు నివాళులర్పించారు. స్తూపం సమీపంలో మొక్క నాటారు. ఆ తర్వాత గ్రామసభలో పాల్గొన్నారు. ఇక్కడ స్మృతివనం ఏర్పాటుకు గ్రామసభ తీర్మానం చేసింది. కలెక్టర్ స్మృతివనం ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

రేవంత్‌రెడ్డి ఆదేశాలతో..
ఓ వైపు రాష్ట్ర రాజధానిలోని ఎల్బీ స్టేడియంలో నూతన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి ఏర్పాట్లు సాగుతున్నాయి. గురువారం ఉదయమే కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు ఇంద్రవెల్లి స్తూపం వద్ద అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు వచ్చాయి. దీంతో వెంటనే కలెక్టర్ రంగంలోకి దిగి గ్రామసభలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపారు.

ఫోకస్ ఎందుకంటే..
సీఎం రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లి స్తూపం వద్ద అభివృద్ధిపై ప్రమాణ స్వీకారం రోజే దృష్టి సారించడం ప్రాధాన్యత సంతరించుకుంది. దీనిపై కాంగ్రెస్‌లో జోరుగా చర్చ సాగుతోంది. ప్రధానంగా 2021 జులైలో టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత రాష్ట్రంలో దళిత, గిరిజన దండోరా పేరిట సభలు తలపెట్టారు. ఇందులో భాగంగా 2021 ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజు ఇంద్రవెల్లిలో స్తూపం సమీపంలో బహిరంగ సభ నిర్వహించారు. ఆ రోజు రాష్ట్రంలో అందరి చూపు ఆసభ పైనే ఉంది. లక్ష మందికి తగ్గకుండా సభ నిర్వహిస్తామని చెప్పడమే ఇందుకు కారణం. అన్నట్లుగానే జనసమీకరణ జరగడం, ఇంద్రవెల్లి సభ సక్సెస్ కావడం కాంగ్రెస్‌లో ఉత్సాహం నింపింది. ఆ రోజు అమరవీరుల స్తూపాన్ని సందర్శించి నివాళులర్పించిన రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం రోజే ఇక్కడ అభివృద్ధి చేయాలని నిర్ణయం తీసుకోవడం ప్రధానంగా ఆదివాసులను ఆకట్టుకుంది. 1981 ఏప్రిల్ 20న గిరిజనులు భూమిపై హక్కుల కోసం ఇంద్రవెల్లిలో సమావేశం నిర్వహించగా ప్రభుత్వ ఆంక్షల కారణంగా పోలీసులు వారిపై తుపాకీ ఎక్కుపెట్టారు. ఈ ఘటనలో అనేక మంది మృత్యువాత పడ్డారు. అప్పటినుంచి ప్రతీ ఏడాది గిరిజనులు ఈ స్థలంలో అమరవీరులకు నివాళులర్పిస్తున్నారు. అందులో భాగంగానే అప్పట్లో అక్కడ స్తూపం నిర్మించారు. అయితే గత పాలకులు ఇక్కడ అభివృద్ధి చేపడతామని చెప్పినప్పటికీ చర్యలు తీసుకోలేదు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

జిల్లా జైలులో నాటుకోళ్ల విక్రయం



జిల్లా జైలులో విక్రయానికి సిద్ధంగా నాటు కోళ్లు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని జిల్లా జైలు ఆవరణలో నాటుకోళ్ల విక్రయించేందుకు అధికారులు నిర్ణయించారు. అరెకరంలో ప్రత్యేక షెడ్లు వేసి జైలు అధికారులు ఆసిల్‌క్రాస్ జాతికి చెందిన 200 పందెం కోళ్లు పెంచుతున్నారు. హైదరాబాద్ నుంచి ఒకరోజు వయస్సు గల పిల్లలను తీసుకువచ్చి పెంపకం చేపడుతున్నారు. మునగ ఆకుతోపాటు వివిధ రకాల చిరు ధాన్యాలను ఆహారంగా వేస్తున్నారు. కోళ్లు పెద్దవి కావడంతో శుక్రవారం నుంచి కిలోకు రూ.350 చొప్పున విక్రయించనున్నారు. ఇందుకోసం జైలు వద్ద ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా జైలు సూపరింటెండెంట్ అశోక్ తెలిపారు. ఆసక్తి గలవారు జైలు వద్దకు వచ్చి తీసుకువెళ్లాలని సూచించారు. మొదటి విడతలో పెంచిన కోళ్లకు మంచి డిమాండ్ ఉండగా, రెండో విడత పెంపకం చేపట్టినట్లు తెలిపారు. గతంలో కోళ్ల విక్రయం ద్వారా రూ.లక్షా ఐదు వేల ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. ఇందులో రూ.50వేలు వాటి నిర్వహణకు ఖర్చు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం జైలు ఆవరణలో బొప్పాయి విక్రయించేందుకు సిద్ధంగా ఉందని వివరించారు.

ఆదివాసీలు స్మరించుకునేలా స్మృతివనం

ఇంద్రవెల్లి: మావనాటే మావ రాజ్ (మా ఊళ్లో మా రాజ్యం) అన్న నినాదంతో పోరాడి అసువులు బాసిన ఆదివాసీ గిరిజన అమరవీరులను స్మరించుకునేలా స్మృతి వనం ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. గురువారం మండలంలోని ఆదివాసీ గిరిజన అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. స్తూపం పరిసర ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆదివాసీ పెద్దలు, అమరవీరుల స్తూపం కమిటీ సభ్యులతో గ్రామసభ నిర్వహించారు. ముందుగా ఆదివాసీ పెద్దల అభిప్రాయాలు సేకరించారు. అమరవీరుల స్తూపం చుట్టూ ప్రహరీ నిర్మించాలని, స్తూపాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలని, అప్పటి ఘటనలో అసువులు బాసిన అమరవీరుల కుటుంబీకులు, గాయాలపాలైన వారి కుటుంబీకులను అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకునేలా తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించాలని ఆదివాసీ పెద్దలు మెస్రం వెంకట్‌రావ్, మెస్రం చిన్ను పటేల్ అధికారులను కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామసభలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు చీఫ్ సెక్రటరీ సూచనల మేరకు ఆదివాసీ గిరిజన అమరవీరుల స్తూపం వద్ద స్మృతి వనం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. స్తూపం వద్ద ఎకరం పరిధిలో అందమైన స్మృతి వనాన్ని ఏర్పాటు చేయడానికి అన్ని శాఖల అధికారులతో చర్చించినట్లు తెలిపారు. ఇందుకు గ్రామసభ తీర్మానం కూడా తీసుకున్నామని, దానిని ప్రభుత్వానికి అందిస్తామని పేర్కొన్నారు. జల్.. జంగల్.. జమీన్ కోసం పోరాడి అసువులు బాసిన అమరవీరులకు నివాళులర్పించడానికి వచ్చే ఏప్రిల్ 20లోపు ఇక్కడ స్మృతి వనాన్ని పూర్తి చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ఎంపీపీ పోటే శోబాబాయి, జెడ్పీటీసీ సభ్యురాలు ఆర్క పుష్పలత, డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో కిషన్, ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, డీఎల్పీవో భిక్షపతిగౌడ్, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, ఆర్ఐ లక్ష్మణ్, పంచాయతీ ఈవో సంజీవ్‌రావు, ఆదివాసీ పెద్దలు, ఆదివాసీ నాయకులు మెస్రం నాగ్‌నాథ్, కినక జుగాదిరావ్, ఆర్క ఖమ్ము, కుడే కైలాస్, ముఖడే ఉత్తం, సోమరే నాగోరావ్, జాదవ్ లఖన్, తుంరం లక్ష్మణ్ తదితరులున్నారు.



స్తూపం వద్ద మొక్క నాటుతున్న కలెక్టర్, పీవో

బాధిత రైతులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

ఎదులాపురం: వాతావరణ మార్పులతో పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా ఇన్‌చార్జి బండారి రవికుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో గురువారం ఏర్పాటు చేసిన పార్టీ జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇటీవల కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. వర్షాలు, తుపాన్ కారణంగా జిల్లాలో పత్తి, శనగ, కంది పంటలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. పత్తి పంట పసుపు రంగుకు మారడంతో అధికారులు కొనుగోలు చేయడం లేదని పేర్కొన్నారు. క్వాలిటీ సమస్య పరిగణనలోకి తీసుకోకుండా మద్దతు ధరతో కొనుగోలు చేయాలి డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వం ఆదిలాబాద్ నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని కోరారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా బీజేపీని గెలిపిస్తే సీసీఐని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రజలు బీజేపీ అభ్యర్థిని ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారని తెలిపారు. వెంటనే సీసీఐని ప్రారంభించేలా చొరవ చూపాలని కోరారు. ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు రైల్వే లైన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని, హామీల అమలు దిశగా కార్యాచరణ రూపొందించాలని, ఎయిరోడ్రమ్ నిర్మాణం చేపట్టాలన్నారు. హామీల అమలుకు పార్లమెంట్ సమావేశాల్లో నిర్ణయాలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కళాశాల తరగతులను వెంటనే ప్రారంభించాలని, కళాశాల నిర్మాణాన్ని కూడా చేపట్టాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను క్షేత్ర స్థాయిలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లంక రాఘవులు, అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, నాయకులు దత్తాత్రి, కిష్టన్న, ఆశన్న, సురేందర్, మంజుల, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలు చిరస్మరణీయం



విరాళాలు సేకరిస్తున్న ఎన్‌సీసీ కెడెట్లు

ఆదిలాబాద్: దేశ రక్షణకు పాటుపడే సైనికుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా ప్రాంతీయ సైనిక సంక్షేమాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రంలో ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టారు. శత్రు దేశాల నుంచి దేశపౌరులను రక్షిస్తున్న సైనికుల సంక్షేమానికి ఎంత పాటుపడినా తక్కువేనని తెలిపారు. వారి సంక్షేమానికి విరాళాలు ఇవ్వడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. సేకరించిన విరాళాలను డీడీ రూపంలో సైనిక్ వెల్ఫేర్‌కు జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ నిధికి పంపించే మొత్తానికి ఆదాయ చట్టం ప్రకారం పన్ను మినహాయింపు లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఎన్‌సీసీ కెడెట్లు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో విరాళాలు సేకరించారు. మేజర్ కారుణ్య కాలాంజి, కే కిశోర్, అహ్మద్ హుస్సేన్, 32 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ కెడెట్లు, మాజీ సైనికుల అధ్యక్షులు శంకర్‌దాస్, ఎండీ మజహర్ హుస్సేన్, దేవన్న, అశోక్, మాజీ సైనికులు హాజరయ్యారు.

క్లుప్తంగా

జెడ్పీటీసీ పదవికి అనిల్‌జాదవ్ రాజీనామా



అనిల్‌జాదవ్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బోథ్ ఎమ్మెల్యేగా ఎన్నికైన అనిల్‌జాదవ్ నేరడిగొండ జెడ్పీటీసీ పదవికి రాజీనామా చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం అనిల్ జాదవ్ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్నను పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామన్న అనిల్‌జాదవ్‌ను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఉన్నత విద్యాసదస్సులో ఆర్జీయూకేటీ వీసీ



మాట్లాడుతున్న వీసీ వెంకటరమణ

భైంసా(ముధోల్): హైదరాబాద్‌లో గురువారం జరిగిన ఉన్నత విద్యా సదస్సులో ఆర్జీయూకేటీ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న సంప్రదాయ విద్యకు మించిన కొత్త నైపుణ్యాలు, జ్ఞానాన్ని పొందే అలవాటును పెంపొందించుకోవాలన్నారు. స్థిరమైన అభ్యాసతత్వానికి కట్టుబడి ఉండాలన్నారు. కెరీర్ పురోగతికి ఒక ప్రయోజనకరమైన సాధనం అవుతుందన్నారు. బాసర ఆర్జీయూకేటీని ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపడుతున్నామన్నారు.

నేడు జోనల్‌స్థాయి ఎంపిక పోటీలు

నిర్మల్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్‌స్థాయి అండర్–14, అండర్–17 టెన్నికాయిట్ ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ రమణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సోన్ మండలంలోని కడ్తాల్ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న పోటీల్లో పాల్గొనదలచిన విద్యార్థులు సంబంధిత ప్రధానోపాధ్యాయుడు లేదా ప్రిన్సిపాల్ సంతకంతో కూడిన 4 ఎలిజిబిలిటీ ఫారాలు, బోనాఫైడ్, ఆధార్ కార్డు జిరాక్స్‌లు వెంట తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాల కోసం పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు మంగళారపు వెన్నెలను 9908963333 నంబరులో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ షాక్‌తో మూగజీవాలు మృతి



మృతి చెందిన గేదెలు

లక్ష్మణచాంద(నిర్మల్): విద్యుత్‌షాక్‌తో రెండు గేదెలు, ఒక పెంపుడు కుక్క మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన ఎల్లన్న, మహేందర్ అనే రైతులకు చెందిన రెండు గేదెలు గురువారం ఉదయం గ్రామ సమీపంలోకి మేతకు వెళ్లాయి. మేత మేసే క్రమంలో విద్యుత్ తీగ తెగి పడటంతో రెండు గేదెలు, అజయ్ అనే వ్యక్తికి చెందిన పెంపుడు కుక్క అక్కడికక్కడే మృతి చెందాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ఆదివాసీ గూడెం నుంచి అసెంబ్లీకి..

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రస్థానం
- స్వగ్రామం ఉట్నూర్ మండలం కల్లూర్‌గూడ
- కష్టపడి చదివించిన తల్లిదండ్రులు
- ఆదివాసీ హక్కుల కోసం పోరాటం..
- రేవంత్‌రెడ్డికి అనుచరుడిగా గుర్తింపు..
- ఎన్నికల్లో గెలుపొందడంపై గ్రామస్తుల హర్షం



ఇందిరమ్మ ఇంటి ఎదుట బొజ్జు కుటుంబ సభ్యులు

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): కొండకోనల్లో విసిరి పడేసినట్లు ఉన్న చిన్నపాటి గ్రామం కల్లూరుగూడ. ఉట్నూర్ మండలం ఘన్‌పూర్ గ్రామ పంచాయితీ పరిధిలో ఈ గ్రామం వెలిసింది. గ్రామంలో 25 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలుపొందిన వెడ్మ బొజ్జు పటేల్ ఈ గ్రామానికి చెందిన వాడే. చిన్నపాటి గ్రామంలో ఇందిరమ్మ ఇంట్లో బొజ్జు కుటుంబం నివాసం ఉంటోంది. తల్లిదండ్రులు గిరిజాబాయి, భీంరావు దంపతులు వ్యవసాయం చేస్తూ కష్టపడి బొజ్జును చదివించారు. తమ కొడుకు బాగా చదివి ఉన్నతంగా రాణించాలని ఆ తల్లిదండ్రులు కన్న కలలు నేడు నెరవేరాయి. అసెంబ్లీ ఎన్నికల్లో బొజ్జు గెలుపొందడంతో గూడెంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామస్తులతో పాటు కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కష్టపడే తత్వం ఉంది



మా కుమారుడు బొజ్జుకు చిన్ననాటి నుంచి కష్టపడే తత్వం ఉంది. ఇంటి వద్ద ఎప్పుడూ ఖాళీగా ఉండేవాడు కాదు. అతని కష్టానికి ఎప్పుడూ వెన్నంటి ఉన్నాం. ఆదివాసీలకు హక్కులు కల్పించేందుకు కృషి చేస్తుండేవాడు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంద్రవెల్లిలో నిర్వహించిన సభలో బొజ్జుకు ప్రజల్లో ఉన్న ఆదరణను రేవంత్‌రెడ్డి గుర్తించి ఎన్నికల్లో పార్టీ టికెట్ ఇచ్చారు. ప్రజలు ఓటు వేసి గెలిపించడం సంతోషం కలిగించింది.

– వెడ్మ భీంరావు, బొజ్జు తండ్రి

సంతోషంగా ఉంది



మా కొడుకు ఎమ్మెల్యేగా గెలిచాడని తెలిసి మేము, మా గ్రామస్తులు ఎంతో సంతోషపడ్డాం. ఎప్పుడూ ఈ ప్రాంత గిరిజనుల అభివృద్ధి కోసం ఆలోచిస్తూ ఉండేవాడు. ఎన్నికల్లో గెలవడంతో ఈ ప్రాంత ప్రజలకు న్యాయం చేస్తాడని, వారి సమస్యలు పరిష్కరిస్తాడని ఆశిస్తున్నాం. బొజ్జు గెలుపొందడంతో రోజూ ఎవరో ఒకరు వచ్చి మాకు శుభాకాంక్షలు తెలపడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది.

– గిరిజాబాయి, బొజ్జు తల్లి

హక్కులకోసం పోరాడుతుండేవారు



నేను కుమురంభీం జిల్లాలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్నా. ముందు నుంచీ మా ఆయనకు కష్టపడే గుణం ఉంది. ఎప్పుడూ ఈ ప్రాంత ఆదివాసీల హక్కుల సాధనకోసం పోరాడుతుండే వారు. రాత్రి వరకూ ఇంటికి వచ్చే వారు కాదు. ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయనకు మంచి అవకాశం లభించింది. ఈ ప్రాంత అభివృద్ధికి తప్పకుండా కృషి చేస్తాడని ఆశిస్తున్నాం.

– దృపద, బొజ్జు సతీమణి

ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా నడవాలి

- ఎంపీ సోయం బాపూరావు
- సీఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు



సోయం బాపూరావు

ఆదిలాబాద్: తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవాలని ఎంపీ సోయం బాపూరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి, మంత్రివర్గానికి అభినందనలు తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. సంక్షేమాన్ని పట్టించుకోలేదని, మార్పుకోసం ప్రజలు ఈ ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటువేసి బీఆర్‌ఎస్ పార్టీని ఓడించారన్నారు. నూతన సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఇంద్రవెల్లిలో స్మారక వనాన్ని ఏర్పాటు చేసి ఆదివాసీల హక్కులను కాపాడాలన్నారు. ఆదివాసీల ప్రధాన సమస్య అయిన పోడు భూములకు పట్టాలు, మారుమూల గ్రామాలకు కనీస వసతులు కల్పించాలని కోరారు.

రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి వరప్రసాద్

ఆదిలాబాద్‌టౌన్: రాజీమార్గంలోనే కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా జడ్జి డాక్టర్ సీహెచ్ వీఆర్‌ఆర్ వరప్రసాద్ సూచించారు. గురువారం జిల్లా కోర్టులో పోలీస్ అధికారులతో జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. ఈ నెల 30వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికసంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా పోలీస్ అధికారులు చూపాలన్నారు. క్రిమినల్, ఎక్సైజ్, సివిల్, భూతగాదాలు, కుటుంబ తగాదాలు, బ్యాంక్ రికవరీ, చిట్‌ఫండ్ కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకుంటే సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి డాక్టర్ పీ శివరాం, ఎస్పీ డీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే, సీనియర్ సివిల్ జడ్జి ప్రమీళాజైన్, పీసీఆర్ కోర్టు జడ్జి తులసి దుర్గాలక్ష్మి, డీఎస్పీలు నాగేందర్, ఉమేందర్, టూ టౌన్ సీఐ అశోక్, రూరల్ సీఐ సైదారావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నను ఆశిస్తున్న కత్తెర పురుగు

- పలు గ్రామాల్లో పంటలు పరిశీలించిన ఏఈవో
- సాక్షి కథనానికి స్పందన



మొక్కజొన్న పంట పరిశీలిస్తున్న ఏఈవో శ్రీవాణి

దిలావర్‌పూర్(నిర్మల్): మొక్కజొన్న, జొన్న పంటలపై మిచాంగ్ తుపాన్ ప్రభావం చూపుతోంది. 'పంటలపై మిచాంగ్ పంజా' శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం మండలంలోని గుండంపల్లి క్లస్టర్ పరిధిలోని గుండంపల్లి, సముందర్‌పల్లి, కాండ్లి గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటలను ఏఈవో శ్రీవాణి పరిశీలించి తగు సలహాలు, సూచనలు అందించారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో పంటలను చీడపీడలు ఆశిస్తాయని, రైతులు గమనించి నివారణ చర్యలు చేపడితే అదుపులో ఉంటాయన్నారు. కానీ ఇప్పటికే రెండుమూడు సార్లు మందులు పిచికారీ చేసినా పురుగులు అదుపులోకి రావడంలేదని గుండంపల్లి గ్రామానికి చెందిన రైతు అనుముల మహేశ్ పేర్కొన్నారు. మొక్కకు ఎండతో పాటు సస్యరక్షణ చర్యలు చేపడితే చీడపీడలను అదుపులోకి తీసుకు రావచ్చని ఏఈవో పేర్కొన్నారు. ముఖ్యంగా మొక్కకు తెగులు ఆశిస్తున్నాయని, 150 లీటర్ల నీటికి 100 గ్రాముల కొరాజిన్ లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ కలిపి ఎకరా విస్తీర్ణంలో పిచికారీ చేయాలని సూచించారు. నెల రోజుల పంటలో పురుగు తీవ్రత అధికంగా ఉండి కాండాన్ని తొలుస్తుంటే కార్బోఫ్యూరాన్ 3 నుంచి 5 గుళికల చొప్పున మొక్కకు మొగిలో వేయాలని సూచించారు. నిత్యం పంటను గమనిస్తూ సస్యరక్షణ చర్యలు చేపడితే పంటలు ఆశాజనకంగా ఉండి ఆశించిన దిగుబడి వస్తుందని ఆమె పేర్కొన్నారు.

అటవీ అధికారులతో ఆదివాసీల వాగ్వాదం



ఆదివాసీలతో మాట్లాడుతున్న అటవీ అధికారులు

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ పంచాయతీ పరిధిలోని గొండుగూడ ఆదివాసీలు అటవీ అధికారులతో గురువారం వాగ్వాదానికి దిగారు. కొన్నేళ్లుగా తాము సాగు చేస్తున్న పోడు భూములను పునరావాసం కింద రాంపూర్, మైసంపేట్ గ్రామస్తులకు కేటాయించడం సరికాదన్నారు. తమకు పోడు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గొండుగూడ వాసుల డిమాండ్‌ను అటవీ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వారి నిర్ణయం మేరకు పనులు చేపడతామని ఎఫ్‌ఆర్వో అనిత తెలిపారు.

గ్రహణ మొర్రి బాధితులకు ఉచిత ఆపరేషన్లు



వైద్యశిబిరానికి హాజరైనవారితో వైద్యుడు ముకుందరెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: గ్రహణ మొర్రి బాధితులకు అవసరమైన ఆపరేషన్లను ఉచితంగా చేయనున్నట్లు బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యుడు ముకుందరెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాల ఆవరణలోని భవిత కేంద్రంలో ఆ ఆస్పత్రి, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఉచిత గ్రహణ మొర్రి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. జిల్లాలోని 15మంది బాధితులు హాజరు కాగా, వారికి ఆయన పరీక్షలు నిర్వహించారు. పలువురిని శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేశారు. పెదవి, అంగిలి చీలిక లాంటి సమస్యలతో బాధపడే వారు ఇలాంటి వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో ఎంపిక చేసిన 15మందికి జనవరిలో శస్త్రచికిత్స నిర్వహించనున్నట్లు తెలిపారు. సెక్టోరియల్ అధికారి సుజాత్‌ఖాన్, ఐఆర్పీలు పాల్గొన్నారు.

ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలి

- తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గణేశ్



మాట్లాడుతున్న గోడం గణేశ్

ఆదిలాబాద్‌రూరల్: నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కుమురంభీం కాలనీలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1981 ఏప్రిల్ 20న వీరమరణం పొందిన ఆదివాసీ అమరుల స్థూపాన్ని అమరవీరుల స్మృతి వనంగా ఏర్పాటు చేస్తామన్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత పాలకులు ఇంద్రవెల్లి అమరులు, వారి కుటుంబాలను గుర్తించకపోవడం బాధాకరమన్నారు. వారిని ఆదుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కేంద్రంలోని మావల మండలం కొమురంభీం కాలనీ సర్వేనంబర్ 72/23లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న 1500 మంది ఆదివాసీలకు పట్టాలివ్వాలని పలుమార్లు జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినప్పటికీ పట్టించుకోలేదన్నారు. జానెడు జాగ కోసం ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు ఆదివాసీలు పోరుబాట పట్టారని గుర్తు చేశారు. సమావేశంలో జిల్లా ప్రచార కార్యదర్శి వెట్టి మనోజ్, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, మావల మండల అధ్యక్షుడు ఆత్రం గణపతి, ఆత్రం భుజంగ్, గోడం జంగుబాయి, కొమురం గోవిందరావు పాల్గొన్నారు.

క్షణికావేశంలో వివాహిత ఆత్మహత్య



కవిత (ఫైల్)

ఇంద్రవెల్లి(ఖానాపూర్): క్షణికావేశంలో పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ముత్నూర్‌లో చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు, ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపిన వివరాల ప్రకారం బోథ్ మండలంలోని వజ్జర గ్రామానికి చెందిన కవిత (26)కు ఇంద్రవెల్లి మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన గేడం జ్యోతిరాంతో 2021లో వివాహమైంది. గురువారం ఉదయం జ్యోతిరాం మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. క్షణికావేశంలో కవిత ఇంట్లో ఉన్న గుర్తు తెలియని పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలు తండ్రి సిడాం లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

తాంసి(బోథ్): జీవితం విరక్తితో ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భీంపూర్ మండలంలోని గోముత్రి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కినాకే గజానన్ (32) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతని భార్య కొన్ని రోజులుగా ధనోరాలోని పుట్టింట్లో ఉంటోంది. ఈ క్రమంలో మద్యానికి బానిసైన గజానన్ బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై లాల్ సింగ్ నాయక్ మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. భార్య కొమాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

నేరడిగొండ(బోథ్): మద్యం మత్తులో ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని శంకరాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం శంకరాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ శేఖర్ (26) కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. నిత్యం మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. బుధవారం ఇంటికి వచ్చి భార్యతో గొడవపడి ఇంటినుంచి వెళ్లగొట్టాడు. రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం భార్య ఇంటికెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మృతుని భార్య ప్రీతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

తానూరు(ముధోల్): మండలంలోని బెల్‌తరోడా శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గురువారం గ్రామ శివారు ప్రాంతానికి వెళ్లగా అక్కడ ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టుబడ్డారన్నారు. వారి వద్ద నుంచి రూ.50,120 నగదుతో పాటు ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బ్రెయిన్ ట్యూమర్‌తో బాలుడు మృతి

లక్ష్మణచాంద(నిర్మల్): బ్రెయిన్ ట్యూమర్‌తో బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని నర్సాపూర్‌లో చోటు చేసుకుంది. నర్సాపూర్ (డబ్ల్యూ) గ్రామానికి చెందిన లక్ష్మి, రాజేశ్వర్ దంపతుల ఏకైక కుమారుడు రిషి (12) రెండేళ్లుగా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నాడు. పలుమార్లు సిజేరియన్ చేయించినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. రెండు నెలల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా గురువారం మృతి చెందాడు.

ఉన్న ఒక్కడూ కానరాని లోకాలకు...

నిరుపేద కుటుంబానికి చెందిన దంపతులకు రిషి ఒక్కడే సంతానం. రెండేళ్లుగా బాలునికి వైద్యచికిత్స కోసం అప్పులు చేసి దాదాపు రూ.15 నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చు చేశారు. ఉన్న ఒక్క కుమారుడు కానరాని లోకాలకు వెళ్లిపోవడంతో వారు రోదించిన తీరు ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టించింది.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న చిలుక దేవిదాస్

ఎదులాపురం: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి చిలుక దేవిదాస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజులుగా తుపాన్ ప్రభావం కారణంగా పత్తి, కంది, సోయా, వివిధ రకాల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు.

సాయిబాబా ఆలయంలో దీపోత్సవం



దీపోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని గండి రామన్న సాయిబాబా ఆలయంలో గురువారం సాయంత్రం దీపోత్సవం నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 11,116 దీపాలను వెలిగించారు. ఆలయ చైర్మన్ లక్కడి జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఏటా కార్తీకమాసంలో ఆలయంలో దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాయి దీక్ష సేవాసమితి సభ్యులు నందు, సోమేశ్వర్, రేఖ, రాణి, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన ఉద్యోగ సంఘాల నాయకులు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న డీఎంహెచ్‌వో

ఆదిలాబాద్: అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన పాయల్ శంకర్‌ను గురువారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కుల సంఘాల నాయకులు సైతం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, వ్యవసాయ అధికారి పుల్లయ్య, వివిధ కుల సంఘాల నాయకులు మనోజ్ ఉన్నారు.

అమరవీరులను విస్మరించిన కాంగ్రెస్

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థి అమర వీరుల త్యాగాల పునాదులపైన ఏర్పడ్డ తెలంగాణ కాంగ్రెస్ నాయకుల చేతిలో మరోమారు అవమానానికి గురైందని బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకరణ కార్యక్రమంలో జై తెలంగాణ నినాదాన్ని విస్మరించి జై సోనియమ్మ నినాదంతో తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ పెద్దల కాళ్ల ఎదుట తాకట్టు పెట్టారని ఆరోపించారు. స్వరాష్ట్రం కోసం తమ ప్రాణాలను బలిపెట్టిన అమరుల త్యాగాలను విస్మరించి అవమాన పరిచారని, ఒక్కరంటే ఒక్క అమరుడి కుటుంబాన్ని వేదికపైకి పిలిచి సన్మానించలేదని ఆరోపించారు. తెలంగాణ పట్ల కాంగ్రెస్ నాయకుల దొంగ ప్రేమను ప్రజలు గమనించాలని కోరారు.

జ్యోతిబాపూలేగా పేరు మార్చడం హర్షణీయం

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రేవంత్‌రెడ్డి ప్రగతి భవన్ పేరును మహాత్మ జ్యోతిబాపూలే ప్రజాభవన్‌గా మారుస్తున్నట్లు ప్రకటించడం హర్షించ దగ్గ విషయమని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పేట్కులే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి సంఘం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. పూలే దంపతులు చేసిన సేవలు చిరస్మరణీయమని వారు చేసిన సేవలకు గుర్తింపుగా ప్రగతి భవన్‌కు ఈ నామకరణం చేయడంతో సార్థకత చేకూరిందని పేర్కొన్నారు. మాలీలకు ఎస్టీ హోదా కల్పించి సామాజిక న్యాయం చేకూర్చాలని ప్రభుత్వాన్ని కోరారు.

పేదల కోసం ప్రత్యేక విందు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రానికి చెందిన మదన్ అనే రియల్ వ్యాపారి కూతురు వివాహం గురువారం మావల మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ శుభకార్యంలో సదరు వ్యాపారి పేదల కోసం ప్రత్యేకంగా విందు భోజనం తయారు చేయించారు. బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌కు ఫోన్ ద్వారా సమాచారమందించగా ఆ సొసైటీ అధ్యక్షుడు అజీజ్ స్థానిక కేఆర్‌కే.కాలనీలోని యువకుల సహకారంతో సుమారు 300 కుటుంబాలకు భోజనాన్ని పంపిణీ చేశారు. కే.ఆర్.కే.కాలనీ వాసులు నూతన వధూవరులను, తనను ఆశీర్వదించారని అబ్దుల్ అజీజ్ తెలిపారు.

ప్రమాణ స్వీకారానికి.. కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో గురువారం జరిగిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి జిల్లా నుంచి కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు కంది శ్రీనివాస్‌రెడ్డి, అడె గజేందర్, ఏఐసీసీ సభ్యులు నరేశ్‌జాదవ్, జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, ఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముగినెల నర్సింగ్, నాయకులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి తదితరులు ప్రత్యేక వాహనంలో వెళ్లి ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు.

రిమ్స్‌లో అన్నదానం

ఎదులాపురం: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బేర దేవన్న తన 60వ పుట్టిన రోజును పురస్కరించుకుని రిమ్స్‌లో అన్నదానం చేశారు. రిమ్స్‌లోని రోగులు, వారి బంధువులకు గురువారం అన్నదానం చేశారు. అనంతరం అక్కడే కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు.

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని కేఆర్‌కే కాలనీకి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బుధవారం ఇంటి నుంచి బయల్దేరిన యువతి గురువారం ఉదయం వరకు ఇంటికి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం గాలించగా ఎంతకూ యువతి ఆచూకీ లభించకపోవడంతో గురువారం యువతి తండ్రి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇష్టారాజ్యంగా ఇటుక బట్టీలు

- బట్టీల ఏర్పాటుకు ఎనిమిది శాఖల అనుమతి అవసరం
- వాల్టా చట్టానికి తూట్లు
- ప్రభుత్వ ఆదాయనికి భారీగా గండి
- పట్టించుకోని ఆయా శాఖల అధికారులు
- యథేచ్ఛగా ఏర్పాటు చేస్తున్న వైనం


ఉండమ్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన ఇటుక బట్టి(ఫైల్)

తలమడుగు: ఆదిలాబాద్ డివిజన్‌లో ఇటుకబట్టీల తయారీ జోరుగా సాగుతోంది. బట్టీల ఏర్పాటు కోసం పలు ప్రభుత్వ శాఖల నుంచి అనుమతి తప్పనిసరి. కానీ డివిజన్‌లోని తలమడుగు, ఆదిలాబాద్‌లోని పలు గ్రామాల శివారుల్లో అనుమతి లేకుండానే విచ్చలవిడిగా బట్టీలను ఏర్పాటు చేస్తున్నారు. అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో గ్రామ పంచాయతీల ఆదాయాని గండిపడుతోంది.

మండలంలోని గ్రామాల్లో...

తలమడుగు మండలంలో కజ్జర్ల, రుయ్యాడి, ఉండమ్ గ్రామాల శివారుతో పాటు ఆదిలాబాద్ చుట్టుపక్కల గ్రామాలైన బట్టిసావర్గమ, మావల శివారులో ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారు. పలు గ్రామాల్లో 10 ఏళ్ల నుంచి ఆదిలాబాద్ నుంచి నిర్వాహకులు వచ్చి బట్టీలను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వానికి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహకులు లక్షలు రూపాయలు గడిస్తున్నారు. ఇక్కడ తయారు చేసిన ఇటుకలను తాంసి, జైనథ్, ఆదిలాబాద్, బేల, గుడిహత్నూర్ మండలాతో పాటు మహారాష్ట్రలోని శివారు గ్రామాలకు సైతం తరలిస్తున్నారు.

చెరువుల్లోని మట్టి..

ఇటుక బట్టీలకు ఇక్కడ మట్టి అనుకూలంగా ఉండడంతో నిర్వాహకులు జిల్లా కేంద్రం నుంచి వచ్చి బట్టీలను కొనసాగిస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఉండడంతో బట్టీల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇటుకల తయారీకి నల్లమట్టి అవసరం కావడంతో సమీపంలోని చెరువుల్లో నుంచి రాత్రి వేలలో మట్టిన్ని డంప్ చేసుకుంటున్నారు. చెరువుల్లో మట్టిన్ని తరలించాలంటే తప్పనిసరిగా అధికారుల అనుమతి తప్పనిసరి. అవేమి పట్టనట్లుగా ఇష్టారాజ్యంగా పదుల సంఖ్యల్లో టిప్పర్లల్లో మట్టిన్ని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. రెండువేల ఇటుకకు రూ.12వేలకు విక్రయిస్తున్నారు. ఇది బట్టీల (తయారు కేంద్రం వద్ద) బయటకు అదనంగా రూ.1000 రవాణా ఖర్చులతో కలిపి 2000 ఇటుకను రూ.14వేలకు విక్రయిస్తున్నారు.


మట్టిన్ని టిప్పర్‌లో తరలిస్తున్న దృశ్యం


ఇటుకబట్టి వద్ద నిల్వచేసిన చెరువు మట్టి

అనుమతి పొందడం ఇలా..

గ్రామాల్లో ఇటుకబట్టీ ఏర్పాటు చేయాలంటే ఎనిమిది శాఖల నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. మొదట ఆ గ్రామ పంచాయతీ నుంచి అనుమతి తీసుకోవాలి. ఆ తరువాత రెవెన్యూ, నీటిపారుదల శాఖ, మైనింగ్, విద్యుత్, కార్మికశాఖ, పరిశ్రమల శాఖల నుంచి అనుమతి పొందాలి. ఇటుక బట్టీల్లో వాడే బొగ్గు కోసం జిల్లా పరిశ్రమ శాఖ అనుమతి అవసరం. వాల్టా చట్టం ప్రకారం రెవెన్యూ అనుమతి, విద్యుత్ అక్రమంగా వాడకం నిరోదానికి విద్యుత్ శాఖ, చెరువు మట్టి తవ్వకాల కోసం ఇరిగేషన్ శాఖ అనుమతి తప్పిసరి. మండలంలోని ఇటుక బట్టీల్లో ఒక్కదానికి కూడా ఆయా శాఖల అనుమతి లేదు.

విద్యుత్ వాడకంలోనూ...

ఇటుకబట్టీలలో పంటపొలాల్లో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీలకు వ్యవసాయానికి వాడే ఉచిత విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బయటకు మాత్రం డీజిల్ ఇంజన్లు వాడుతున్నట్లు చూపుతూ వాస్తవానికి ఉచిత విద్యుత్‌ను అక్రమంగా వాడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బట్టీలలో మహారాష్ట్ర, ఒరిస్సా నుంచి వచ్చిన వారికి తక్కువగా కూలి చెల్లించి వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. అలాగే పలు బట్టీల్లో బాలకార్మికులతో పని చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

అనుమతులు తీసుకోవాలి

గ్రామాల్లో ఇటుక బట్టీల ఏర్పాటుకు మొదట మైనింగ్ శాఖ అనుమతులు తీసుకోవాలి. ఆ తరువాత ఇతర శాఖల అనుమతులు తీసుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకు రెవెన్యూశాఖ నుంచి ఎవరికి అనుమతులు ఇవ్వలేదు.

– తహసీల్దార్, రాజ్‌మోహన్

వైభవంగా సప్తాహ ముగింపు


పల్లకి ఊరేగిస్తున్న భక్తులు

బేల: మండలంలోని కొబ్బాయి గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక గురువు బాజీరావు బాబా సప్తాహ ముగింపు వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ప్రధాన వీధుల గుండా బాజీరావు బాబా చిత్రపటంతో చిన్నారులను దేవతల రూపంలో అలకరించి పల్లకీ ఊరేగింపు చేపట్టారు. తర్వాత బాజీరావు బాబా ఆలయ ఆవరణలో ప్రధాన శిష్య బృందం భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు వినిపించారు. చివరగా కాల దహీ హండిని చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ పల్లకి సేవ ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శిష్యులు ఠాక్రే సందీప్, సీతరాం, తదితరులు పాల్గొన్నారు.

కైలాస టెకిడిలో సాగుతున్న పూజలు


పూజలో ముధోల్ ఎమ్మెల్యే రామారావ్‌పటేల్

బోథ్: మండలంలోని నిగిని గ్రామ పంచాయతీ పరిధిలోని కైలాస్ టెకిడి సర్వదేశ్వర ఆలయంలో 21వ వార్షికోత్సవం సందర్భంగా సామూహిక జనకళ్యాణం కోసం పూజలు నిర్విరామంగా జరుగుతున్నాయి. గురువారం రుద్రాభిషేకం, హారతి, మండలపూజ, హోమం నిర్వహించారు. ఇటీవల ముధోల్ ఎమ్మెల్యేగా ఎన్నికైన రామారావ్ పటేల్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు వందలాదిగా ఆలయానికి తరలివస్తున్నారు. ఈ నెల 9వ తేదీ వరకు వార్షికోత్సవ వేడుకలు జరగనున్నాయి. ముధోల్ ఎమ్మెల్యే వెంట కుంటాల ఎంపిపి గజ్జారాం, బాసర జెడ్పీటీసీ రమేష్, భైంసా జెడ్పీటీసీ సోలంకి భీంరావ్, మాజీ ఎంపీపీ రమణరావ్, మాజీ మున్సిపల్ చైర్మన్ గంగాధర్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కొనసాగుతున్న నరసింహుని జాతర


జాతరలో భక్తజనం

జైనథ్: మండల కేంద్రంలోని అతి ప్రాచీన శ్రీలక్ష్మీ నారాయణ స్వామి ఆలయ జాతర కొనసాగుతోంది. స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. గురువారం భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. స్వామి వారి రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా మహిళలు, చిన్నారులు జాతరలో అలంకరణ వస్తువులు, గృహోపకరణాలు, తినుబండారాలు కొనుగోలు చేస్తూ సందడి చేసారు.

ప్రజాసేవకే నిరంతరం పెద్దపీట


ఎమ్మెల్యే అనిల్‌కు మొక్క ఇస్తున్న డీపీవో శ్రీనివాస్


తాంసి: ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

ఇచ్చోడ: ప్రజాసేవకు పెద్దపీట వేసి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధితో పాటు అన్నివర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. గురువారం ఆయన సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడారు. భారీ మెజార్టీతో గెలిపించిన బోథ్ నియోజకవర్గ ప్రజలకు జీవితంతాం రుణపడి ఉంటన్నారు. 15 ఏళ్లగా రాజకీయ జీవితంలో ఉన్నానని, ప్రతి రోజు ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానని తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న ప్రతీ సమస్యపై అవగాహన ఉందన్నారు. నియోజకవర్గ, మండలస్థాయి నాయకుల సమన్వయంతో నియోజకవర్గం అభివృద్ధి కోసం ముందుకు వెళ్లనున్నట్లు వివరించారు. కేసీఆర్, కేటీఆర్ ఆశీస్సులతో నియోజవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి కోసం ప్రత్యేక కృషి చేస్తానని వివరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నియోజవకర్గం అభివృద్ధి వైపు అడుగులు వేగంగా కదిలేవన్నారు. గెలుపుకు సహకరించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యేగా అనిల్‌జాదవ్ ఎన్నికైన సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మండల కేంద్రంలోని ఆయన నివాసంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌తో పాటు నేరడిగొండ ఇన్‌చార్జి ఎంపీడీఓ శోభన, ఎంఈఓ భూమారెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ సౌందర్య, ఇరిగేషన్ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీసు తదితర శాఖల అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


నేరడిగొండ: ఎమ్మెల్యేను కలిసిన అధికారులు

ఎమ్మెల్యేను కలిసిన మండల నాయకులు

తాంసి: బోథ్ నూతన ఎమ్మెల్యేగా గెలుపొందిన అనిల్‌జాదవ్‌ను తాంసి మండల నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నేరడిగొండలోని ఎమ్మెల్యే నివాసంలో బండల్‌నాగాపూర్ నాయకులు ధనుంజయ్, వెంకట్‌రెడ్డి గ్రామస్తులతో కలిసి ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను శాలువాతో సన్మానించారు. గ్రామంలో భారీ మెజార్టీ వచ్చే విధంగా కృషి చేసిన మండల నాయకులను అనిల్ జాదవ్ అభినందించారు. వారి వెంట నాయకులు రాహుల్ రెడ్డి, ముఖేష్, స్వామి ఉన్నారు.

ముగిసిన బోర్లకుంట జాతర

- మొక్కులు తీర్చుకున్న భక్తులు
- భక్తజనంతో కిటకిటలాడిన దర్గా


భక్తులతో కిటకిటలాడుతున్న దుకాణాలు


దర్గా వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని, పిప్పల్‌కోటి గ్రామ శివారులోని దవల్‌మాలిక్ బాబా బోర్లకుంట జాతర గురువారం వైభవంగా ముగిసింది. మంగళవారం దర్గా వద్ద ప్రత్యేక పూజలతో ప్రారంభమైన జాతర మూడు రోజులుగా కొనసాగింది. జాతర సందర్భంగా వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై దర్గా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మూడు రోజులుగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధికంగా సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. జాతర చివరి రోజు గురువారం దర్గా వద్ద నిపాని గ్రామస్తులతో పాటు దర్గా కమిటీ సభ్యులు నిపాని దర్గా నుండి చాదర్‌ను తీసుకొచ్చి దర్గా వద్ద సమర్పించారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన దుకాణాలు భక్తుల రాకతో కిటకిటలాడాయి. కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు కాశీం, స్థానిక గ్రామాల సర్పంచ్‌లు రాజన్న, గంగయ్య, కరీం, నాయకులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన బోధన చేయాలి


అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్ సతీష్

నేరడిగొండ: విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేయాలని స్టేట్ రిసోర్స్ పర్సన్ సతీష్, నోడల్ అధికారి చక్రపాణి అన్నారు. ఎంపీడీఓ సమావేశ మందిరంలో గురువారం మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు యూడైస్, పునాది అక్షరాస్యత సంఖ్య శాస్త్రంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బోధించే తీరుపై ఉపాధ్యాయులకు వివరించారు. ఈ సమావేశంలో ఎంఈఓ భూమారెడ్డి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ రాం అనిల్, సీఆర్పీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు


నేరడిగొండ: స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు


బేలలో కాంగ్రెస్ శ్రేణుల విజయోత్సవ ర్యాలీ

నేరడిగొండ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. స్వీట్లు తినిపించుకొని బాణసంచాలు పేల్చారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆడె వసంత్ రావు, బోథ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి ప్రపుల్‌చందర్ రెడ్డిలు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు షకీల్, బద్దం పోతారెడ్డి, అనుపట్ల సంజీవ్ కుమార్, బుక రాములు, పాల శంకర్, ఈర్ల శ్రీకాంత్, ఆడె జనార్దన్, సుభాష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సంబరాలు

బేల: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కలతో మంత్రులు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక జాతీయ రహదారిపై విజయోత్సవ ర్యాలీ నిర్వహించి, టపాసులు కాల్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, జైనథ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వాంఖడే వామన్, నాయకులు సామ రూపేష్‌రెడ్డి, గుండవార్ సంజయ్, గావుండే ఘనేశ్యాం పాల్గొన్నారు.


ఇచ్చోడ: సంబురాల్లో కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి

ఇచ్చోడ: కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని బ్లాక్ కాంగ్రెస్ నాయకులు మహిముద్‌ఖాన్ అన్నారు. మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన సంబురాల్లో పాల్గొని మాట్లాడారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో బోథ్ నియెజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. మండల అధ్యక్షుడు కళ్లెం నారాయణరెడ్డి, ఎస్సీసెల్ చైర్మన్ కొత్తురి లక్ష్మణ్ ఉన్నారు.

బెల్లూరి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన


వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేస్తున్న పూజారులు


క్రేయిన్ సాయంతో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన


విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: బెల్లూరి ఆయ్యప్ప ఆలయంలో రెండ్రోజులుగా వేదపండితులు ఫణతుల మేగరాజ్ శర్మ చేతుల మీదుగా హోమాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు ప్రత్యేక పూజలు నిర్వహించగా, రెండవ రోజైన గురువారం ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన, కదుత్తస్వామి, కరుప్పస్వామి, కరుప్పాయమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ యంత్ర స్థాపన, శాంతి పౌక్షిక హోమం, జయాది హోమములు, బలి హారం పూర్ణాహుతి, కుంభాభిషేకం, అవబ్రదం హారతి తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు కుంబోజి సూర్యకాంత్ స్వామి, ప్రధాన కార్యదర్శి దాముక రవీందర్ స్వామి, ఆలయ కోశాధికారి టింగం నరేష్ స్వామి, ఈర్ల సత్యనారాయణ స్వామిలచే హోమం నిర్వహించారు. హోమం అనంతరం అన్నదానం నిర్వహించారు. ఇందులో గురుస్వాములు అనిల్ దేశ్పాండే, చందా గణేష్ గురుస్వామి, నగేష్, శరత్ రెడ్డి, సాయి రాజ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.